హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

గజ్వేల్: ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 2: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఏడు మాసాలు గడిచినా పూర్తి స్థాయిలో హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కొమటిబండ గ్రామానికి చెందిన ఉబ్బని అశోక్ కొద్ది రోజుల క్రితం నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో మంజూరైన రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును మంగళవారం మృతుడి భార్య పోశవ్వకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు, అసత్య ప్రచారాలతో ప్రజలను, రైతులకు కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.40వేల కోట్లు అప్పు చేసిందని, వాటిని ఏ సంక్షేమ పథకాలకు ఖర్చుచేశారో ప్రజలకు చెప్పాలన్నారు. మళ్లీ రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, పురుగుల మందు డబ్బాలతో రైతులు వీడియో చిత్రీకరించి ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, దేశంలోనే కార్యకర్తలకు ప్రమాదబీమా సౌకర్యాన్ని కల్పించి ఆదుకుంటుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోనే 350 మంది కార్యకర్తలు వివిధ కారణాలతో మృతి చెందితే వారికి రూ.7కోట్ల చెక్కులు అందజేశామన్నారు. రైతుబీమా ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ గౌడ్, గొడుగు స్వామి, తూం శేఖర్, ఎల్లయ్య, చంద్రశేఖర్, అహ్మద్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 2 : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జక్కుల మమత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమెకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రతాప్‌రెడ్డి ఆమె భర్త అనిల్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, రైతు బంధు సమితి మాజీ మండలకో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్, నాయకులు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, దోమల ఎల్లం యాదవ్, దొమ్మాట మహిపాల్‌రెడ్డి, గుండెల్లి ఆంజనేయులు, ఎలుక రాజిరెడ్డి, కోడెల మల్లేశం పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ దంపతులు

ములుగు, జూలై 2 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను క్షీరసాగర్ ఎంపీటీసీ, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్‌కొన్యాల మమతాబాల్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా కలిశారు. మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మంగళవారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కేబీఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలపై కేసీఆర్ అభినందించినట్లు వారు తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ దంపతులు మమతా బాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

అటవీ హద్దులు నిర్ధారించాలి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్,జూలై 2 : అటవీ హద్దులు నిర్ధారించాలని, ఆక్రమణలు తొలిగించుటకు అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అటవీసంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 77 ప్రాంతాల్లో 23738 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉందన్నారు. అటవీ హద్దులు నిర్ధారించుటకు అటవీ, రెవెన్యూశాఖల అధికారులు జాయింట్ సర్వే పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ బిల్లులు రద్దుచేయాలి

మిషన్‌భగీరథ బిల్లులు రద్దుచేయాలంటూ హుస్నాబాద్ మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌టౌన్, జూలై 2 : మిషన్‌భగీరథ తాగునీటి బిల్లులు రద్దుచేయాలని కోరుతూ హుస్నాబాద్‌లో మహిళలు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏండ్ల తరబడి తాగునీటి బిల్లులు కట్టాలని వేధించడంపై మహిళలు మూకుమ్మడిగా కార్యాలయం ఎదుట బైఠాయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మిషన్‌భగీరథ తాగునీటి కనెక్షన్లకు వేలాది రూపాయలు చెల్లించాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు. తక్షణమే పట్టణంలోని మిషన్‌భగీరథ తాగునీటి బిల్లులను రద్దుచేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికారి ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగా కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. కిసాన్‌సంఘ్‌నాయకుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, బీఎస్పీ నాయకుడు పచ్చి మట్ల రవీందర్‌గౌడ్, రేణుక, కోమల, కనకవ్వ, లక్ష్మి, సునీత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 2: ప్లాస్టిక్ కవర్లకు బదులు బట్టసంచులు వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం 'సఫాయి అప్నాబీమారి భగావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించడం మానుకోవాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ తడి, పొడిచెత్తను ఎలా వేరు చేయాలనే చూపించారు. చెత్తను వేరుచేసి ఇవ్వని పక్షంలో రూ.500 వరకు జరిమానా విధించడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ మేనేజర్ రవికుమార్, బేసిల్‌ఫౌండేషన్ పౌండర్ ఉదయ్, కోపౌండర్ టి. రాజు, వార్డు అధికారి, ఆర్పీ, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం

పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 2 : మద్దూరు మండల కేంద్రానికి చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు సాంబరాజు హరికిషన్ వ్యవసాయ క్షేత్రంలో సాంబరాజు ప్రమీల ఆధ్వర్యంలో వారి మనుమడు సాయి సంప్రీత్ కుటుంబ సమేతంగా భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాన్ని జరిపించారు. గణేశ్‌శర్మ వైదిక నిర్వహణలో అర్చకులు అర్చనలు, అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదవితరణ, మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పానుగంటి తిరుపతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూలై 2: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరాలనికి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశశి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, జువాలజీ, బయోటెక్నాలజీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్-2 సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హులైన వారు ఈనెల 4న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, జూలై 2: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్ అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎనిమిదో వార్డులో దోమల మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాసుదేవ్, నాగరాజు, దుర్గాగౌడ్, రమేశ్, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్, సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

కొమురవెల్లి ఎస్సైకి సన్మానం

కొమురవెల్లి, జూలై 2 : కొమురవెల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లింగంపల్లి రాజుగౌడ్‌ను మంగళవారం కొమురవెల్లి మండల గౌడసంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండలాధ్యక్షుడు మెరుగు కృష్ణాగౌడ్, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు పచ్చిమట్ల స్వామిగౌడ్, గౌడ సంఘం జాతీయ నాయకులు ముత్యం నర్సింహులుగౌడ్, కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, బత్తిని నర్సింహులు గౌడ్ పాల్గొన్నారు.

నేర రహిత సమాజానికి కృషి చేయాలి

హుస్నాబాద్, జూలై 2: నేర రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని న్యాయవాది జే కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని టీజీఎస్ మోడల్ స్కూల్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన భారతీయ న్యాయ సంహితపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నూతన క్రిమినల్ చట్టాలు, సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలపై ఆడపిల్లలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. భారతీయ న్యాయ సంహితలో కఠినమైన శిక్షలు అమలులోకి వచ్చాయని, వీటిపై అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. చట్టాలకు, సెక్షన్లకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సదస్సులో సర్వశిక్షా అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ వాసవి, మండల అడ్వకేట్ బాకం సంపత్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ, సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు లావణ్య, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 2 : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. మంగళవారం కొండపాక మండలంలోని మర్పడగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. బాలికలు, మహిళలు అపరిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకు వివరాలు చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో మహిళ ఇన్‌స్పెక్టర్ దుర్గా, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బైరయ్య, షీ టీమ్ సిబ్బంది, పాల్గొన్నారు.

సాగు చేసే భూమికి రైతుభరోసా ఇవ్వాలి

చేర్యాలలో సమావేశం నిర్వహిస్తున్న సొసైటీ చైర్మన్ చంద్రారెడ్డి

చేర్యాల, జూలై 2 : సాగు చేసే భూమి 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని రైతులు సూచించారు.పట్టణంలోని రైతువేదికలో మంగళవారం రైతుబంధు(భరోసా) పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చేర్యాల ఆధ్వర్యంలో అత్యవసర మహాజన్ సర్వసభ్య సమావేశం పీఏసీఎస్ చైర్మన్ వంగా చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఏడీఏ రాధిక, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణారెడ్డి, ఏవో అఫ్రోజ్, నరేశ్, సహకార సంఘం డైరెక్టర్లు హాజరైన సమావేశంలో రైతులు సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని, గుట్టలు, చెట్లు,రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఎట్టి పరిస్థితిలో రైతుభరోసా ఇవ్వరాదని సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం అభిప్రాయ సేకరణ

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ కోసం మద్దూరు మండలం రేబర్తిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ పది ఎకరాలలోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు రైతు భరోసా, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు.కోపరేటీవ్ డిప్యూటీ రిజిస్ట్రర్స్ ఆడిట్ ఆఫీసర్ ఎ. నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు భరోసాపై వ్యక్తం చేసిన రైతుల అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. సీఈవో బోయిని శ్రీధర్, డైరెక్టర్లు కొండ అంజయ్య, కర్రెడ్ల శ్రీధర్‌రెడ్డి, నలుసాని మోహన్‌రెడ్డి, భూక్యా జగన్, దేవునూరి దేవదాసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి

రైతు నేస్తానికి ఆసక్తి చూపని రైతులు

గజ్వేల్, జూలై 2: వ్యవసాయ పంటలపై సలహాలు, సూచనలు అందించే వీలుగా శాస్త్రవేత్తలు, వ్యవసాధికారులు పాల్గొని ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు గజ్వేల్ డివిజన్ పరిధిలోని రైతులు ఆసక్తిని చూపించలేదు. గజ్వేల్ రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో రైతులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు, వ్యవసాధికారులు సమగ్ర వ్యవసాయంలో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. మేకల పెంపకం, సేంద్రియ వ్యవసాయం,కలుపుతీత నివారణ, అంతర పంటల సాగు, ఎరువులపై వివరించారు. ఏడీఏ బాబునాయక్, ఏవోలు నాగరాజు, ప్రియదర్శిని, ఏఈవోలు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుభరోసా అమలుచేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై2: ప్రభుత్వం వెంటనే రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతాంగానికి రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టుబడి డబ్బులు లేక రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై2: నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కోత్వాల్ యాద నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండూరి సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కొండూరి అరవింద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు సింగిరాల శ్రీనివాస్, సలహాదారుడు సింగిరాల కనకయ్య, శ్రావణపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక చట్టం తేవాలి

సిద్దిపేట టౌన్, జూలై 2 : నాయీ బ్రాహ్మణులకు వృత్తి పరంగా ప్రత్యేక చట్టం తేవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో న్యూ నాయీ బ్రాహ్మణ కార్యవర్గాన్ని ఎనుకున్న నేపథ్యంలో బీజేఆర్. చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వయా దయానంద్ ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. న్యూ నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన

గజ్వేల్‌లో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

గజ్వేల్, జూలై 2: ప్రతి నెలా జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు గజ్వేల్ ఐపీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ జీతాలు త్వరగా విడుదల చేయాలని కోరారు. ఎనిమిది నెలలుగా జీతాలు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా పెండింగ్ జీతాలు త్వరగా విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు కోరారు.

నిరుద్యోగుల సమస్యలపై స్పందించాలి

గజ్వేల్, జూలై 2: నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో గజ్వేల్ డిప్యూటీ తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని,25వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కరుణాకర్, సాయికిరణ్, మనోహర్ పాల్గొన్నారు.

పాన్నాల వాసి ప్రభాకర్‌కు డాక్టరేట్

డాక్టరేట్ పొందిన ప్రభాకర్

సిద్దిపేట అర్బన్, జూలై 2 : ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసినందుకు మండలంలోని పాన్నాల గ్రామానికి చెందిన కానుగంటి ప్రభాకర్‌కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో "రీసెర్చ్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్ ఇన్వెస్టిగేషన్ క్యారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ కూమరిన్" అనే అంశంపై ప్రొఫెసర్ దేవేశ్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు రాజస్థాన్ రాష్ట్రంలోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభాకర్ హైదరాబాద్‌లోని న్యూ ల్యాండ్ ల్యాబరేటరీస్‌లో రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ విభాగంలో సీనియర్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభాకర్‌కు డాక్టరేట్ రావడంపై సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటే స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో జయదేవ్ ఆర్య

మిరుదొడ్డి జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వన మహోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం మిరుదొడ్డిలోని ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల గణేశ్‌రెడ్డి, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

పాట్లపల్లిలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, జూలై 2: మండలంలోని పాట్లపల్లి జడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 73 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్లను ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, వేణుమాధవ్, భిక్షపతి, శివకుమార్, సరస్వతీ, సరళకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట టౌన్, జూలై 2 : ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి మోసం చేసిన నిందితుడిని సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జోరవంతల సత్యనారాయణ సిద్దిపేట సీతారామ్‌నగర్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని కార్యాలయాన్ని ప్రారంభించాడు. తాను యాంటీ కరప్షన్ ఇంటెలిజెన్స్ కమిటీ జనరల్ సెక్రటరీ అని చెప్పుకుంటూ సిద్దిపేట శంకర్‌నగర్‌కు చెందిన వరప్రసాద్, గాంధీనగర్‌కు చెందిన అశోక్‌లకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. వరప్రసాద్ నుంచి 4,15,000, అశోక్ నుంచి 1,50,000 తీసుకున్నాడు. అనంతరం కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దకు మార్చాడు. ఆఫీస్ ఖర్చులకు డబ్బులు కావాలని రెంటు అడ్వాన్స్ ఇవ్వాలని చెప్పి మరో రూ.15వేలను బాధితుల నుంచి తీసుకున్నాడు. నెల తర్వాత వెళ్లి అడుగగా ప్రభుత్వం మారిందని,ఎన్నికల తర్వాత ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి కాలయాపన చేశాడు. గట్టిగా నిలదీస్తే చంపేస్తానని బెదిరించాడు. ఈ మేరకు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితుడిని పట్టుకున్నారు. సత్యనారాయణను అదుపులోకి తీసుకొని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై నర్సింహారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 2: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రామ్మోహన్ మంగళవారం ఒక ప్ర